19

# పువ్వు అందం

"మధురానగరిలో చల్లనమ్మబోను దారి విడుము కృష్ణా" అంటూ ఆ అమ్మాయి గంతేం వెయ్యలేదు. ఆరాజమార్గంలో గంతులు వెయ్యవచ్చో, వెయ్యకూడదో ఆమెకి తెలుసో, తెలియదో మనకి తెలియదు. అసలా అమ్మాయికి ఆ మాత్రం భరతనాట్యం వచ్చా అనే ప్రశ్న కూడా మనకి అనవసరం. ఎందుకంటే శాస్త్రోక్తంగా వచ్చినా, రాకపోయినా కాస్తో కూస్తో సినిమాడాన్సన్నా రాకుండా ఉంటుందా అని ఎవరైనా అన వచ్చు. ఆ అమ్మాయి సినిమాలు చూడదని నేను చెప్పలేను. డాన్స్ అలా ఉంచి కృష్ణుడయ్యేది, మరొకడయ్యేది కొంగు పుచ్చుకుంటే మాత్రం చెంగున లేడిపిల్లలా దూకి ఛెళ్ళున చెంపదెబ్బ వెయ్యకుండా ఊరుకునే స్వభావం కాదామెది. ఇంక పాటా గీటా అంటారా! ఆమెకి అంతో ఇంతో కూనిరాగం రాదని నేను అనలేను. కాని ఆ సమయంలో ఆమె మనసులో కూనిరాగాల పిలుపులకి కాని, నృత్యభంగిమల తలపులకి కాని చోటులేదు. ఆమె వడి వడిగా నడుస్తున్నది. పరాకు చిత్తగించటం లేదు. ముందున్నది రోడ్డని ఆమెకి తెలుసు. రోడ్డుమీద బళ్ళు పోతున్నాయనీ, మనుషులు నడుస్తున్నారనీ ఆమెకి తెలుసు. వాళ్ళని తప్పించుకు త్వరగా పోవాలనే ఆమె తాపత్రయం. ఎండెక్కి పోతుంది. అప్పటికే ఎనిమిది దాటింది. బడికి వేళయిందని కాదు. ఆ గొడవ ఆమె కెందుకు? ఏదో సంకేత స్థలానికి పోయే సమయం మించిపోతోందని కాదు. ఆ సంకేతాల సంగతులింకా ఆమెకి తెలీదు. పూల బాసలైనా తెలుసో తెలియదో! జడలో ఒక చామంతి పువ్వు మాత్రం ఉంది. నెత్తి మీద గంప వుంది, గంపలో ముంతలున్నాయి. ముంతల్లో పాలు, పెరుగు, వెన్న ఉన్నాయి. మనసులో పెరుగు మార్కెట్టుంది. మార్కెట్టులో పోటీ ఉంది.

ఆ ప్రాంతంలో రద్దీ అంతగా ఉండకపోయినా, ఆ నాలుగు రోడ్లకూడలి పట్నంలో ముఖ్యమయినదే. ఆ కూడలి ముఖ్య విశేషమేమంటే ఆదిమ, మధ్యమ ఆధునిక నాగరికతాచిహ్నాము లయిన సమస్త రోడ్డు రవాణా వాహనాలకి అది ఆట పట్టు. ఆ వాహనాల స్వచ్ఛంద విహారాలకి అది ప్రత్యక్ష సాక్షి. లాగుడు బండ్లేమిటి, రిక్షా బండ్లేమిటి, కార్లు, బస్సులు, లారీలు, ఆటోలేమిటి, సైకిళ్ళేమిటి, ఎడ్లబండ్లేమిటి,

స్కూటర్లేమిటి, ట్రాక్టర్లేమిటి వాహన నాగరికత అంతా కలగాపులగమై, అడ్డదిడ్డమై అక్కడ పల్టీ కొట్టటం టికెట్ లేని ఒక వినోద ప్రదర్శన. ఈ వాహనాల రోగుల మధ్య చిక్కుకున్న పాదయాత్రికుల అవస్థ ఆ పరమాత్ముడికే ఎరుక. ఇంక చతుష్పాద జీవులుకూడా ఎదురైతే కవి గారన్నట్టు, శ్రీమతే రామానుజాయనమః ! అయితే పాదయాత్రికుల్ని గురించి వాహనయోగులు కూడా ఇలాగే అనుకోకూడదనేం లేదు. సరిగ్గా ఆ ఉదయం అదే జరిగింది.

టక టకలాడిస్తు లాగుడుబండి మలుపు తిరిగింది.

బర్ర్‌మని బస్సు తప్పించుకు దూసుకుపోయింది.

గణగణమంటూ రెండెడ్లబండి అడ్డదిడ్డంగా పోసాగింది.

కీచు కీచుమంటూ స్కూటర్ జర్రున ముందుకు పోయింది.

టంగ్ టంగ్‌మంటూ రిక్షా వీటన్నిటినీ తప్పించుకు వస్తోంది.

ఆ అమ్మాయి వడివడిగా అడుగు లేస్తోంది.

రోడ్డు మధ్యగా జనం పెళ్ళినడకలు నడుస్తున్నారు.

రిక్షాని తప్పించుకోవాలని ఆ అమ్మాయి ప్రక్కకి తప్పుకుంది.

ఆ అమ్మాయిని తప్పించుకోవాలని రిక్షాప్రక్కకి జరిగింది.

తొట్రుపాటులో ఆ అమ్మాయి ఎటు తప్పుకుంటే రిక్షా అటే తిరిగింది. రిక్షా మళ్ళీ సర్దుకుంటే ఆ అమ్మాయి అటే తప్పుకుంది. అటే అటే, ఇటే ఇటే! తప్పుకో, తప్పుకో! ఎహె ! "ఓమ్మో" అరుపులో బెదురు. బెదురులో అరుపు.

ఆ అమ్మాయి తూలి పడిపోయింది. గంప కింద పడింది. ముంతలు పగిలి పాలు, పెరుగు, వెన్న నేలపాలయాయి. చేమంతిపువ్వు రేకులు విడి నేలపాలయింది.

రిక్షా డ్రైవర్ రిక్షా దిగి తెల్లబోయి చూడసాగాడు.

జనం ఎక్కడి వాళ్ళక్కడ నిలబడిపోయారు. నేలమీద పాలు, పెరుగు, వెన్న ! వాటివైపు బిక్కముఖంతో చూస్తూ లేవబోతున్న ఆ అమ్మాయి, నోటమాట లేక రిక్షాడ్రైవర్! "ఓహో అదృష్టం" అనుకొని స్నాప్‌షాట్ కొట్టాడు ఓ విద్యార్థి.

"చచ్చినాడా !" అందా అమ్మాయి రిక్షాడ్రైవర్ని రుసరుస చూస్తూ.

"నేనెటు తిరిగితే నువ్వు అటే తిరిగితే నేనేం చేసేది ?" రిక్షాడ్రైవర్ తన విశాలమైన భుజస్కంధాల మీంచి ఆ చిన్న భుజస్కంధాల మీదికి బాధ్యత నెట్టివేశాడు.

"నువ్వా నేనా తిరిగింది" ఆ అమ్మాయి రెట్టించింది.

"అడుగు, అందరూ చూస్తానే వున్నారుగా. ఏం బాబుగారూ, రిక్షాలో కూచుని మీరు చూస్తూనే ఉన్నారుగా గంట కొట్టానా తప్పుకోమని కేకేశానా, పక్కకి తిప్పేనా, బ్రేకేశానా! ఈ పిల్ల తడబడితే నేనేం చేసేది!" రిక్షాడ్రైవర్ రిక్షాలో వ్యక్తిని తనకి వత్తాసు ఇచ్చి కలగ చేసుకోవలసిందని సూచిస్తూ అన్నాడు.

"అవునవును. ఇతనిదేం తప్పు లేదండీ. పాపం, ఆ పిల్ల తడబడింది. ఇంతకీ లేచిన వేళ మంచిది కాదు. పాపం! పాలూ, పెరుగూ అన్నీ నేలపాలయాయి. కాస్త జాగ్రత్తగా నడవాలమ్మాయ్."

రిక్షాలోని భారీవ్యక్తి భారీగానే జాలి ప్రకటించాడు. జనం రిక్షాచుట్టూ, ఆ అమ్మాయి చుట్టూ చేరారు.

"ఓమ్మో నేను జాగ్రత్తగా నడవలేదా! నాకేం కళ్ళుబైర్లు కమ్మాయనుకున్నారా ఏంటి బాబూ అట్టా అంటారు, జనం రోడ్డుమీదేమన్నా నడవాల్నా? ఏంటా వేగం, ఏంటా ఉరుకు? ఇప్పుడు నేనేం చేయాలి. అమ్మో నలభయి రూపాయల పాలు, పెరుగు, వెన్న అన్నీ బుగ్గిపాలయెనే!" ఆ అమ్మాయి కళ్ల నీళ్లు పెట్టుకొని గాద్గదికంగా అంది.

"నీ అజాగ్రత్తకి ఎవరేం చేస్తారమ్మాయ్?" పోనియ్యవోయ్ రిక్షాలోని భారీ విగ్రహం ఆదుర్దా ప్రకటించింది. వెంటనే ఓ జబర్దస్తీ మనిషి రిక్షామీద చెయ్యేసాడు. "ఎక్కడికండీ పోయేది?" "పట్టుకుని పోలీస్ స్టేషన్‌లో వప్పచెబుదాం రండిసార్— అంతా అలా నిలబడిపోతారేం? ఈ రిక్షా వాళ్ళు మరీ మితిమీరి పోతున్నారు. ఆ దూకుడేమిటో పోలీసు వాళ్ళు తేలుస్తారు."

ఆ జబర్దస్తీ రిక్షాడ్రైవర్లందరిమీద అతనికున్న సాధారణ కోపంవల్లో, ఆ అమ్మాయిమీది సానుభూతివల్లో స్పష్టంకాక మరో వ్యక్తి తన దృష్టికోణం వ్యక్తం చేశాడు.

"ఈ మాత్రానికి పోలీసుల దాకా ఎందుకండీ, అతనిచేత ఆ అమ్మాయికి ఎంతో కొంత నష్ట పరిహారం ఇప్పిస్తే పోలా?"

"అసలు ఎవరిది తప్పో తేల్చండి." ఈ వివాదం తిలకిస్తున్న ఓ లాయర్ సలహా ఇచ్చాడు.

"రిక్షా డ్రైవర్‌దే. యాక్సిడెంటయినప్పుడు నేను స్నాప్‌షాట్ తీశాను. దాన్ని డెవలప్‌చేసి ప్రింట్ తీస్తే స్పష్టంగా తెలిసిపోతుంది."

విద్యార్థి కలగ చేసుకున్నాడు.

"ఎవ్వరికయ్యా నువ్వు ఫోటో తీసింది ? ఫోటో అంట ఫోటో. ఆడపిల్లలికి ఫోటోలు తియ్యటమే నువ్వు చేసే పని. ఇంక చాల్లేపో." రిక్షాడ్రైవర్ మందలించాడు. ఎవరో నవ్వారు విద్యార్థి ముఖం కందగడ్డయింది. "తగ్గు, పక్షురాల్తయ్. ఆ పిల్లని చూడగానే నీకు వెర్రెత్తి, పొగరు పట్టి కావాలని యాక్సిడెంట్ చేసింది కాక నా జోలికి వస్తావా, జాగ్రత్త" ఆ కుర్రాడు తిప్పికొట్టాడు. ఇదంతా వినోదంగా చూస్తున్న ఓ మందులషాపు యజమాని తన ఉనికి తెలియబరుస్తూ అన్నాడు.

"ఈ తగాదాలు సరే, ఆ అమ్మాయికి పాపం వేళ్ళు దోక్కుపోయాయి టిటెనస్ అవుతుందేమో. పోయిన సొమ్ము ఎలానూ పోయింది. టిటెనస్ కాకుండా జాగ్రత్తపడాలి. ఏమ్మా, ఈ పక్కనే డాక్టర్‌గారున్నారు.

"ఏ.టి.యస్. ఇంజక్షన్ ఇస్తారేమో, చూపిస్తాను వస్తావా ?"

ఆయన ఔదార్యానికి జనం సంతోషించే లోపుగానే అతను మళ్ళీ అన్నాడు. "ఎక్కువ ఖర్చు కాదులే."

ఆ అమ్మాయి ఏమీ మాట్లాడలేదు. అప్పటికి పరిస్థితి బాగా అర్థమైంది ! చుట్టూ జనం మూగారు. అంతా తనని చూస్తున్నారు. ఎందుకో ఏడుపు వచ్చింది. ఆపుకుని కళ్ళనీళ్ల తుడుచుకుంది. ఎవరికో జాలివేసింది. సానుభూతిపూర్వకంగా, నిర్మాణాత్మకంగా అన్నారు.

"పాపం, చాలా నష్టమైంది. రిక్షాడ్రైవర్ తప్పయినా, ఈమెది తప్పయినా నష్టం నష్టమేకదా. తలాకాస్త చందా వేసుకుని సాయం చేద్దాము. ఎవరికి తోచింది వారు ఇవ్వండి, నా చందా రెండు రూపాయలు-" అంతా అతనివైపు చూశారు. ఆయన పండిత శాలువా కప్పుకుని ఉన్నాడు.

"ఎంత నష్టమైందంటారు ?"

"ఏమ్మాయ్ ?"

"నలభై రూపాయలండి. మా అయ్య నా వీపు చీరేస్తాడు." ఆమె భయంగా అంది.

"అందులో సగం కొట్టెయ్యండి." అని ఓ చిలిపి కేక వినిపించింది.

"ఎందువల్ల ?"

"నీళ్ళ ఖరీదూ, కల్తీ ఖరీదూ."

నవ్వులు వినిపించాయి. అంత దుఃఖంలోనూ ఆ అమ్మాయి చప్పున తలెత్తి ఆ మాటలు విన్నవైపు చురుక్కున చూసింది. అతను గతుక్కుమన్నాడు. ఆమె చూపులు మరలించి తన ముంతలవైపు చూసింది. పాలముంత, పెరుగుముంత పగిలిపోయి పాలూ, పెరుగూ ప్రవాహాలు కట్టాయి. వెన్నముంత పగిలి చాలాభాగం వెన్న మట్టిలో కలిసిపోయింది. కొంత, పగిలిన ముంతలోనే మిగిలిపోయింది. ఆ పగిలిన భాగం చేత్తో పట్టుకొని అందరికీ చూపిస్తూ ఆమె నాటకీయంగా అంది.

"అయ్యా, కల్తీ అన్నారు. ఇందులో ఎంత కల్తీ ఉందో పరీక్షించి చెప్పండి. చదువుకొన్నారు. అంతా తెలిసినోరు. ఊరికే కల్తీ మాటలు రానియ్యబోకండి."

ఒక క్షణం నిశ్శబ్దం ఆవరించింది. ఆ తర్వాత గుసగుసలు వినిపించాయి. "ఆఁహా! – ఏమో అనుకున్నాం, పొగరు బాగానే ఉందే !" "బాగా వాత పెట్టిందిరా" "ఆడదని జాలిపడ్డాం, మొగాళ్ళని మించిపోయింది." "ఆఁ. తెలిసీ తెలియని వయసు లెండి." "ఏం పదిహేను పదహారేళ్ళుండవా ?" "ఆ. - అంతే ఏదో ఉడుకురక్తం". "కాదు, గడుసురక్తం." కలకలం క్రమంగా పెద్దదవుతోంది.

"ట్రెయిన్ టైమయిపోతోంది. ఇదేం పీడ ! ఏమండీ, మీరేదో తలాకాస్తా ఇద్దామన్నారుగా, ఇదిగో అర్ధరూపాయి, ఆ అమ్మాయి కివ్వండి. ఊఁ - ఇంక పోనియ్యవోయ్, రిక్షా–" రిక్షా జరగటానికి ఖాళీలేదు.

ఎవరూ ముందుకి రావటంలేదు.

"ఆఁ ఎప్పుడూ యాక్సిడెంట్లు జరుగుతూనే ఉంటాయి. ఇవాళ ఇదీ, రేపు ఇంకొకటీ, ఇక్కడే, ఎక్కడో కాదు. ఎన్నిటికని మనం ఇస్తాం. ప్రభుత్వం ఇలాంటి వాళ్ళకి ఇన్సూరెన్స్ స్కీమ్ లాంటిది ఏదైనా అమలుపరచాలి." ఎవరికో ప్రభుత్వం అనేది ఒకటి ఉందని అకస్మాత్తుగా తట్టింది.

"ప్రభుత్వానికి ఒక మహజరు పెట్టించండి. దానిమీద ఓ కమిటీ వేస్తుంది." నవ్వాడు ఇంకొక వ్యక్తి వ్యంగ్యంగా.

శాలువా కప్పుకున్న వ్యక్తి అందర్నీ చందా అడగసాగాడు. ఎవరూ చందా ఇవ్వటానికి ఇష్టపడడంలేదు. కల్తీఖెణుకు విసిరిన వ్యక్తిని అడిగాడు.

"బాబుగారూ, ఆరిని అడగొద్దు" గట్టిగా అరిచింది. ఆమె అతనివైపు చెయ్యి చూపుతూ. అందరూ స్తబ్ధులయారు.

"ఎందువల్ల ?"

"ఆయన నా సరుకు కల్తీ సరుకన్నాడు! ఆయనేం పరీక్షచేసి అన్నాడా ? కల్తీ సరుకు అమ్మటం ఎంత తప్పో మంచి సరుకుని కల్తీసరుకు అనటం అంత తప్పే కదా! నా సరుకు కల్తీదని రుజువు చెయ్యమనండి, లేకపోతే, క్షమాపణ చెప్పమనండి" ఉద్రేకంగా అందామె. అందరూ నిర్విణ్ణులయ్యారు.

"బ్యూటిఫుల్ యాంగిల్, స్నాప్ తియ్యారా చప్పున." కెమేరా ఉన్న విద్యార్థిని పురికొల్పాడు మిత్రుడు.

"ఓహ్ గ్రామీణ సౌందర్యం. మంచి ఫోటో జేనిక్‌సీన్‌లా ఉంది. డైలాగ్ కూడా బాగా చెప్తోందిరా. సినిమా ఛాన్స్ కొట్టేస్తుందేయో." స్నాప్ తీసి అన్నాడు విద్యార్థి.

శాలువా కప్పుకున్న వ్యక్తి అనునయపూర్వకంగా అన్నాడు.

"ఏదో తమాషాగా అన్నార్లే అమ్మా నువ్వలా బాధపడకు. నేటి వ్యాపారం తీరు అలా వుంది అనే దృష్టిలో అన్నారేకాని, నిన్ను అవమానించాలనే ఉద్దేశంతో అనలేదు, ఏమండీ అంతేకాదూ."

"కల్తీ కాదని రుజువు చెయ్యమనండి." ఒక స్త్రీ ముందు, అందులో ఆ పరిస్థితిలో, ఆ పాలు పెరుగు అమ్ముకునే బీదపిల్ల ముందు తను తగ్గిపోవటం అవమానకరంగా ఆ యువకుడికి తోచింది.

"నాన్‌సెన్స్, కల్తీ అన్నవారు మీరు. రుజువు చెయ్యాల్సిన బాధ్యత మీదే. అమెదికాదు." అన్నాడు లాయర్ దృఢంగా. "ఇది లా కోర్టుకాదు. మీరు జడ్జికాదు." ఆ యువకుడు తిరస్కార పూర్వకంగా అన్నాడు.

"ఇది ప్రజల కోర్టు !" లాయర్ అన్నాడు.

"జడ్జి ఎవరో ! వ్యంగ్యంగా అన్నాడా యువకుడు.

"దేవుడు." శాలువా కప్పుకొన్న వ్యక్తి అన్నాడు.

ఆ యువకుడు పగలబడి నవ్వాడు.

"దేవుడు కూడా కల్తీ సరుకే !"

ఆ జోక్‌కి కొంతమంది వ్యంగ్యంగా నవ్వారు. కొంతమంది ఈలవేశారు. ఆ అమ్మాయికి ఆవేశం కలిగింది.

"కల్తీ, కల్తీ! ఈ పెపంచకమే కల్తీ. మనసులు కల్తీ, మాటలు కల్తీ! ఇంక సరుకు కల్తీ అయితే ఏంబోయిందిలెండి. బాబుగారూ, ఇంక మీరు ఎవర్నీ ఏమీ అనకండి సామి. మా అయ్యకి నే చెప్పుకొంటా. ఇంకనించి కల్తీ సరుకే గంప కెత్తుతా. అయ్యో, మంది మధ్యని పేదోళ్ళ ఆడకూతురు నిలబడి పోయిందే. శాలువా కప్పుకున్న గొప్పోరు అయ్యవోరు చెయ్యి చాపి అడుగుతున్నారే అని ఎవరూ జాలి పడరు, ఆదుకోరు. ఎవరెట్టా పోతే ఎవరికేం! నన్ను పోనియ్యండి సామి."

ఆ అమ్మాయి చివాలున గంప ఎత్తి నడుముకు ఆనించుకొని గుంపు తొలగించుకొని పోబోయింది.

శాలువా కప్పుకొన్న వ్యక్తి అందర్నీ ఉద్దేశించి అన్నాడు. "ఇంత మందిమీ ఆ పిల్ల అలా ఉసూరుమని పోతుంటే చోద్యం చూస్తూ నిలబడ్డం తప్ప ఇంకేం చెయ్యలేమా? దయచేసి తలాకాస్త సాయం చెయ్యండి."

"సాయం కోసం మీ దేవుణ్ని ప్రార్థించండి." ఎగతాళిగా అన్నాడు యువకుడు. శాలువా కప్పుకొన్న వ్యక్తి చిరునవ్వు నవ్వాడు.

"ప్రార్థిస్తాము, అయితే నా దేవుడు సోమసుందరుణ్ణేకాదు, మీ దేవుడు జ్ఞాన సుందరుణ్ణో, మరో సుందరుణ్ణోకాదు— మన దేవుడు సమాజ సుందరేశ్వరుణ్ణి, ఆ దేవుడికి ఇక్కడ అభిషేకం జరిగింది. మీరంతా విచ్చేశారు. పేదపిల్ల, ఖర్చంతా భరించలేదు. అందరం పంచుకొందాం." అతను రెండు చేతులూ చాపి దోసిలి పట్టాడు.

"ఓహో! ఇంకో కొత్త దేవుడు వెలిశాడే!" వ్యంగ్యంగా అన్నాడు ఆయన కూడ,

గుంపుని తోసుకొని ముందుకి పోబోతున్న ఆ అమ్మాయి చప్పున వెనక్కి తిరిగింది. శాలువా కప్పుకొన్న వ్యక్తి మాటలు ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయి. ఆమెకి ఏం అర్థమైందో ఏమో: పాలూ, పెరుగూ, వెన్న నేలపాలయిన స్థలానికి తిరిగి వచ్చి చేతులు రెండూ జోడించింది, ఆ తర్వాత రేకులు విడిపోగా మిగిలిన చేమంతిపువ్వు నేలమీదినించి తీసి తల్లో తురుముకుంది. వెంటనే ముందుకి అడుగేసింది.

ఒక్క క్షణం నిశ్శబ్దం. మరుక్షణం శాలువా కప్పుకొన్న వ్యక్తి దోసిలిలో కరెన్సీ నోట్లు, నాణాల వర్షం కురిసింది.

4) [ప్రభవ - మార్చి, 1981]